సాక్షి నిజామాబాద్

బుధవారం, 23, ఏప్రిల్, 2025



భూ సమస్యల పరిష్కారానికే..

భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు.

- 10లో ▸



చదువుతోపాటు..

చదువుతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని భారత మహిళల కబడ్డీ టీం ప్రధాన కోచ్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
44.0 /24.4

వాతావరణం

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిగా భరతలక్ష్మి బాధ్యతల స్వీకరణ



భరతలక్ష్మి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా జడ్జిగా భరతలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని లేబర్ కోర్టులో ప్రెసిడెంట్ ఆఫీసర్‌గా పని చేసిన భరతలక్ష్మి బదిలీపై జిల్లా కోర్టుకు వచ్చారు. ఇక్కడ పని చేసిన జడ్జి సునీతా కుంచాల పెద్దపల్లికి బదిలీ అయ్యారు. న్యాయమూర్తి భరతలక్ష్మికి కోర్టు సిబ్బంది, న్యాయవాదులు స్వాగతం పలికారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని గాదేపల్లిలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఎంవో ప్రిన్సిపల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. చిన్నయానం వద్ద ఎకో టూరిజం ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి సన్నాలు, దొడ్డు రకం ధాన్యాన్ని, రికార్డులను పరిశీలించారు. కేంద్రం నిర్వాహకులు, రైతులతో మాట్లాడి ధాన్యం సేకరణ వివరాలు తెలుసుకున్నారు. తేమశాతం యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయా అని అడిగారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు.

వడదెబ్బ నుంచి రక్షించుకోవాలి



నిజామాబాద్‌నాగారం: వడ దెబ్బ బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'వాతావరణంలో మార్పులు – ఆరోగ్యంపై ప్రభావం' పోస్టర్లను కలెక్టర్ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆవిష్కరించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు కలెక్టర్ సూచించారు. పనిచేసే చోట్ల కార్మికుల కోసం యజమానులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో రాజశ్రీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్, పీవోఎన్‌సీడీ డాక్టర్ సామ్రాట్ యాదవ్, నాగలక్ష్మి, ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

బాలికలదే పైచేయి

ఇంటర్ ఫలితాల్లో బాలికలు మరోసారి పైచేయి సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 53.37 శాతం, రెండో సంవత్సరం ఫలితాల్లో 58.21 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు ఫస్టియర్‌లో 64 శాతం, బాలురు 41శాతం, సెకండియర్‌లో బాలికలు 70 శాతం, బాలురు 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం జనరల్ కోర్సుల్లో మొత్తం 13,945 మంది పరీక్షలకు హాజరుకాగా 8,117 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ ఒకేషనల్‌లో 2,042 మందికి గాను 1,231 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ జనరల్ కోర్సుల విద్యార్థులు 15,056 మందికిగాను 8,035 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం ఒకేషనల్‌లో 2,790 మందికిగాను 1,223 ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఓవరాల్‌గా 25వ స్థానంలో నిలిచింది. – నిజామాబాద్ అర్బన్

ఫస్టియర్‌లో	సెకండియర్‌లో
53.37 శాతం	58.21 శాతం

ఉత్తీర్ణత నమోదు

- బాలికల ఉత్తీర్ణత : ఫస్టియర్ 64శాతం, సెకండియర్ 70శాతం
- ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థినులు
- ఓవరాల్‌గా 25వ స్థానంలో జిల్లా



కాకతీయకు రాష్ట్రస్థాయి ర్యాంకులు



త్రిషాచౌదరి



ఎం.హర్షిత

ఇంటర్ ఫలితాల్లో కాకతీయ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి సత్తాచాటారు. సెకండియర్ ఎంపీసీలో సఫాఅఖిల్ (992/1000) రాష్ట్ర స్థాయి మూడో ర్యాంకు, త్రిషాచౌదరి (991) ఐదో ర్యాంకు, ఆయేషా ఫాతిమా (988)ఏడో ర్యాంకు సాధించారు. అలాగే బైపీసీలో అమ్మతుల్ మోహిరీనా (992/1000), జూనారీయా అంబేర్ (992) మార్కులతో రాష్ట్రస్థాయి మూడో ర్యాంకులు సాధించగా, సోహాస నీలా (988)కు ఎనిమిదో ర్యాంకు దక్కింది.

ఫస్టియర్‌లో..

ఎంపీసీలో బి.కావ్యశ్రీ (467/470) రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు, ఎం.హర్షిత (466), పి.నిత్యశ్రీ(466), ఎం.మృదుల(466), లాస్యశ్రీ(466) మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. కె.కీర్తి (465), ఎం.అశ్రిత(465) నాల్గో ర్యాంకు సాధించారు. ,

బైపీసీలో హనియా ఉమేమా(435/440), వి.ఇందు (435) మార్కులతో మూడోర్యాంకులు సాధించగా, తుబాఫాతిమా(434), రిమ్షా అనమ్(434), వై.శ్రీనిత్య(434) మార్కులతో నాల్గో ర్యాంకు సాధించారు.

ఎస్‌ఆర్ కళాశాల హవా

నగరంలోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో దొంతుల కీర్తి 993/1000 , పిట్టల సాయిశ్రీ (991), జి.గౌతమ్ (991), సహర్షరెడ్డి (990), జె.రాణి (990), ఆకుల శ్రీచందన (989), డి.భవ్య (989)మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో ఏ.హర్షిణి 468/470, ఎస్.దినేశ్ (468), ఎస్.శ్రీజ (468), జి.శ్రీనిధిరెడ్డి (468), కె.సంజన (467) మార్కులు సాధించారు.

బైపీసీ సెకండియర్‌లో..

డి.వైష్ణవి 993/1000 మార్కులు సాధించగా, ఫాతిమా(992), ఎం.హన్సిక(990), కె.రిద్ధి (990), రాథోడ్ స్నేహ(986), ఆర్.రిషిక (981)మార్కులు సాధించారు.

ఫస్టియర్‌లో..

ఎం.వైష్ణవి-438/440, కె.వైష్ణవి (437), హస్మిత (436), జోబియాఫాతిమా (436), ఎండీ రెహాన్ (436), టి.వెష్ణవి (435 మార్కులు సాధించారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



తోట కీర్తన (బైపీసీ, 993) గురుకుల కళాశాల, ధర్మారం



టి.లక్ష్మీ (ఎంపీసీ, 992) గురుకుల కళాశాల, ధర్మారం

- డిచ్‌పల్లి మండలం ధర్మారం (బీ) గురుకుల కళాశాల విద్యార్థిని తోట కీర్తన బైపీసీలో 993/1000, ఎంపీసీలో టి.లక్ష్మీ 992 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో పి.అన్విత 464/470, బైపీసీలో ఎస్.శ్రీనిధి 433/440 మార్కులు సాధించారు.
- నగరంలోని నారాయణ కళాశాల విద్యార్థిని శ్రావణి సెకండియర్ ఎంపీసీలో 993/1000 మార్కులు సాధించగా, ఫస్టియర్ బైపీసీ విద్యార్థి జి వరుణ్ 468/470 మార్కులు సాధించారు.

ఇంజనీర్ అవుతా



రాష్ట్ర స్థాయి ర్యాంకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఎంతో ధైర్యం వచ్చింది. ఎలాంటి ఒత్తిడి లేకుండా చదవడంతోనే మంచి మార్కులు సాధించడం సాధ్యమైంది. భవిష్యత్‌లో మంచి ఇంజినీర్‌ను అవుతా.

– అంబటి శ్రావణి (ఎంపీసీ, 993/1000), నారాయణ

సంతోషంగా ఉంది



ఇంటర్ రెండో సంవత్సరంలో రాష్ట్ర స్థాయి ర్యాంకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రణాళికాబద్ధంగా చదివాను. తరగతి గదుల్లో బోధించిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు పునఃసమీక్షించుకోవడం ద్వారా తేలికగా చదవగలిగాను.

– దొంతుల కీర్తి (ఎంపీసీ, 993/1000) ఎస్‌ఆర్

ప్రణాళిక తోడ్పడింది



ప్రణాళిక రూపొందించుకొని చదవడంతో 992 మార్కులు సాధించడం సాధ్యమైంది. భవిష్యత్‌లో ఇంజనీర్ కావాలనేది నా కోరిక. రాష్ట్ర స్థాయి ర్యాంకు వచ్చేలా ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు.

– సఫాఅఖిల్ (ఎంపీసీ, 992/1000), కాకతీయ

వైద్య సేవలందిస్తా



ఎంతో ప్రణాళికతో చదివా. డాక్టర్ కావాలన్నదే నా ఆశయం. వైద్యురాలిగా పేద వారికి వైద్య సేవలందిస్తా. ఇష్టపడి చదువుతున్నా. కళాశాలలో అధ్యాపకుల బోధన మంచి మార్కులు రావడానికి దోహదపడింది.

– డి.వైష్ణవి (బైపీసీ, 993/1000) ఎస్‌ఆర్

అగ్రి, ఇంజినీరింగ్ కళాశాలలు తీసుకొస్తాం



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల

- పథకాల అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారు
- పేదల కళ్లలో సంతోషం కోసమే సన్నబియ్యం పంపిణీ
- వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు గెలుస్తాం
- రైతులపై లాఠీచార్జి చేసి బేడీలు వేసిన ఘనత బీఆర్‌ఎస్‌ది..
- ఉనికి కోసమే వరంగల్ సభ
- పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్

నిజామాబాద్ సిటీ: జిల్లాకు వ్యవసాయ, ఇంజినీరింగ్ కళాశాలలను తీసుకొస్తామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నందిపేట సెజ్‌ను పునరుద్ధరిస్తామని, సుదర్శన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలోనే జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసే ప్రక్రియను ప్రారంభించారన్నారు. అలాగే నిజాంసాగర్ కెనాల్ ఆధునీకరణ చేపట్టారని పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో మినీ స్టేడియం, సింథటిక్ ట్రాక్ నిర్మిస్తామని, ఎస్ఎస్ఎఫ్, ఎస్‌సీఎస్‌ఎఫ్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కుల సర్వేచేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చట్టం చేశామని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, హామీలపై దేశమంతా చర్చ జరుగుతోందని, రైతులకు అండగా కాంగ్రెస్ ఉంటుందన్నారు. రైతు భరోసా, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, గ్యాస్ సిలిండర్‌కు రూ.500 రాయితీతోపాటు రేషన్‌దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పేదల కళ్లలో ఆనందం కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ఏనాడూ రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. రైతులు వరి కుప్పలమీదే ప్రాణాలు వదిలిన ఘటనలను చూశామన్నారు. రైతులపై లాఠీచార్జి చేసి, వారి చేతులకు బేడీలు వేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. తమ హయాంలో ఏం చేశారో కేసీఆర్, కేటీఆర్ చెప్పాలన్నారు. జిల్లాకు ప్రత్యేకించి వారు చేసిందేమైనా ఉందా అని మహేశ్‌కుమార్ ప్రశ్నించారు. మంత్రిగా ప్రశాంత్‌రెడ్డి జిల్లాకు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఉనికి కోసమే వరంగల్ సభ నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు సాధించి అధికారంలోకి వస్తామని మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తంచేశారు. కాలానికి అనుగుణంగా వక్ఫ్‌బోర్డులో మార్పులు తెస్తే పర్వాలేదని, కానీ ఒక మతాన్ని హననం చేసేలా తక్కువచేసే సవరణలకు కాంగ్రెస్ అంగీకరించదన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లు అంశం సుప్రీంకోర్టులో ఉన్నందున తాను ఎక్కువగా దాని గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, నాయకులు జావేద్ అక్రం, నగేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కొడుకు ఐఏఎస్ కు ఎంపిక

- అభినందించిన డీజీపీ, సీపీ



జాదవ్ సాయిచైతన్య

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న జాదవ్ గోవింద్ కుమారుడు జాదవ్ సాయిచైతన్య యూపీఎస్సీ సివిల్స్ పరీక్షా ఫలితాల్లో ఆల్ ఇండియా 68వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. గత సంవత్సరం సివిల్స్ లో ఐఎఫ్ఎస్ కు ఎంపికైన సాయి చైతన్య పట్టుదలతో చదివి మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. దీంతో డీజీపీ జితేందర్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య లు హెడ్‌కానిస్టేబుల్ జాదవ్ గోవింద్, ఐఏఎస్ సాధించిన సాయిచైతన్య లను ప్రత్యేకంగా అభినందించారు.

భానుడి భగభగ

- జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నిజామాబాద్ అర్బన్: ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం జిల్లాలో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం 43.1 , ఆదివారం 42.3, శనివారం 42.6 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.



ఇందిరమ్మ, భూభారతిపై దృష్టి సారించాలి

- ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు స్టీల్, సిమెంట్ అందించేందుకు చర్యలు
- వీసీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి మంగళవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పైలట్ ప్రాజెక్టుగా భూ భారతి అమలవుతున్న రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు 5,905 దరఖాస్తులు అందాయని నాలుగు పైలట్ మండలాల్లో వచ్చిన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని మే మొదటి వారంలో హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లోని ఒక్కో మండలాన్ని పైలట్ మండలంగా తీసుకొని 28 మండలాల్లో భూభారతి చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లపై..

వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మే మొదటి వారంలోగా పూర్తి చేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. లబ్ధిదారులకు తక్కువ ధరకు స్టీల్, సిమెంట్ ఇచ్చేవిధంగా త్వరలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 16వ తేదీన జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారని తెలిపారు. త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసేలా ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి..

అనధికార లే అవుట్‌ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 25శాతం ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 30వ తేదీతో ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు ముగుస్తుందని, పొడిగించబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రమబద్ధీకరించని భూముల్లో ఎటువంటి రిజిస్ట్రేషన్‌లు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు.

సాగులో మేధోమథనం

- మరిన్ని ప్రయోగాల ఆలోచనలు పెరిగేలా రైతు మహోత్సవం
- పరస్పర ఆలోచనలు పంచుకుంటున్న రైతులు
- ఆకట్టుకుంటున్న యువరైతుల ప్రదర్శనలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్‌లో నిర్వహిస్తున్న రైతు మహోత్సవం రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ మహోత్సవం బుధవారంతో ముగియనుంది. ఈ సమ్మేళనంలో రైతులు పరస్పరం తమ ఆలోచనలను పంచుకున్నారు. సాగులో మరిన్ని ప్రయోగాలు చేసేదిశగా వివిధ అంశాలపై మరింత అవగాహన కలిగేలా ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. పంటల మార్పిడి మొదలు, సరికొత్త సాంకేతికత ఉపయోగించుకోవడం, మరిన్ని మెళకువలు, ప్రకృతి, సేంద్రియ సాగు, పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించడం తదితర అంశాలపై ఈ సమ్మేళనంలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్టాల్స్ ఏర్పాటు చేసిన పలువురు రైతుల, యువ ఔత్సాహికుల గురించి..

దేశంలోనే మొట్టమొదటి బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పిన రైతు బ్రహ్మయ్య..

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన రైతు నాదెండ్ల బ్రహ్మయ్య 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్' సంస్థ ఇచ్చిన సాంకేతిక మద్దతుతో దేశంలోనే మొట్టమొదటి 'బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్' నెలకొల్పారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఇలాంటి 3 వేల కేంద్రాలను ఈ విడతలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. బ్రహ్మయ్య ఏర్పాటు చేసిన రైతు స్థాయి బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్ ల్యాబ్‌లో పురుగులను చంపే, తెగుళ్లను నివారించే సూక్ష్మజీవులకు పశువులు, జీవాల పేడ కలిపి ఎరువు తయారు చేస్తున్నారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇలాంటి యూనిట్లకు సాంకేతిక మద్దతు అందిస్తోంది. బ్రహ్మయ్య ల్యాబ్‌లో తయారవుతున్న ఎరువులు భూసారాన్ని మరింత కాపాడతాయి.



కుంకుడుకాయల సాగుతో పాటు లిక్విడ్స్ తయారీ చేస్తున్న లోకసాని పద్మారెడ్డి..

నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లికి చెందిన రైతు లోకసాని పద్మారెడ్డి 12 ఎకరాల్లో కుంకుడు కాయలు సాగుచేయడమే కాకుండా ప్లాంట్ ఏర్పాటు చేసి వాటితో షాంపూలు, డిష్‌వాష్, హ్యాండ్‌వాష్, ఫ్లోర్ క్లీనర్, సిరామిక్ కేర్ లిక్విడ్, ఆల్ ఇన్ వన్ అగ్రికల్చర్ ప్రొడక్ట్ (ఎరువుగా వాడేది) తయారు చేస్తున్నారు. ఈ ఉత్పత్తులను భారీగా ఎగుమతి చేస్తున్నట్లు పద్మారెడ్డి సోదరుడు వెంకటరెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న హార్టికల్చర్ ఉత్పత్తులు



వనపర్తి జిల్లా మోజర్లలోని ఉద్యాన కళాశాలకు చెందిన బీఎస్సీ హార్టికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు తయారు చేసిన నేచురల్ ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేని షాంపూలు, లిప్‌కేర్, సబ్బులు, హెయిర్ ఆయిల్, ఫేస్ క్రీమ్, జెల్, నన్నారి (ఆరోగ్య పానీయం) పట్ల పలువురు ఆసక్తి చూపారు. ఈ విద్యార్థులు తయారు చేసిన నన్నారి ఉత్పత్తిని చూసిన ఏపీలోని కర్నూలుకు చెందిన రంగయ్య అనే రైతు 10 ఎకరాల్లో నన్నారి(సుగంధి) వేర్లు పంట సాగు చేసి లిక్విడ్ తయారీ ప్లాంట్ నెలకొల్పారు. వీరి ఆధ్వర్యంలోనే ప్లాంట్ ఏర్పాటు చేయడం విశేషం.

బోడకాకర వేర్లకు డిమాండ్..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంకు చెందిన సుబ్బు అనే యువరైతు తీసుకొచ్చిన సేంద్రియ కూరగాయల స్టాల్ ఆకట్టుకుంది. 35 రకాల విత్తనాలను ప్రదర్శించాడు. ఇందులో ఎర్రమొక్కజొన్న, ఎర్రతోటకూర విత్తనాలను పలువురు కొనుగోలు చేశారు. సుబ్బు తనకున్న 9 ఎకరాల్లోని 3 ఎకరాల్లో కూరగాయల విత్తనాల కోసం సాగు చేస్తున్నాడు. ఇతను తెచ్చిన విత్తనాల్లో పెన్సిల్‌దొండ (4అంగుళాల పొడవు కాయ), బోడకాకర వేర్లు బాగా అమ్ముడయ్యాయి.

సేంద్రియ సాగు వైపు మొగ్గుచూపాలి



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ సిటీ : రసాయన ఎరువుల వాడకాన్ని బాగా తగ్గించి సేంద్రియ పద్ధతులను అవలంబించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలని రైతులకు పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు. జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో రైతు మహోత్సవం కొనసాగుతుండగా, రెండో రోజైన సోమవారం మహేశ్‌కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వ్యవసాయ రంగంలో రోజురోజుకు వస్తున్న కొత్త పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రైతు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవగాహన కోసం రైతులను వియత్నాం, మలేషియా వంటి దేశాలకు స్టడీ టూర్‌లకు తీసుకెళ్లాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

రైతులు మూస విధానాలకు స్వస్తి పలికి టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, పంట మార్పిడి విధానాలను అవలంబించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులతో మమేకం కావాలన్నారు. యువత వ్యవసాయంలోకి రావాలని, ఉద్యోగాల కోసం దిగులు చెందొద్దని పేర్కొన్నారు. భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తే ఎకరాకు రూ.40 వేలవరకు సంపాదించొచ్చని సూచించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, వినయ్‌రెడ్డి, నగేశ్‌రెడ్డి, అగ్గుభోజన్న తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు

ఆర్మూర్‌టౌన్: వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులను ఇవ్వనున్నట్లు రీజనల్ మేనేజర్ జోత్స్న తెలిపారు.ఆర్మూర్ మండలం అకాంపూర్‌లో మంగళవారం వీడీసీ, గ్రామ ప్రజలతో టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికుల సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దూర ప్రాంతాల టూర్లకు, వివాహాది శుభకార్యాలకు బృందాలుగా వెళ్లేందుకు ముందస్తుగా బస్సులను బుక్ చేసుకోనే అవకాశం ఆర్టీసీ కల్పిస్తుందన్నారు. డిజిటల్ చెల్లింపు సౌకర్యం సైతం ఉందన్నారు. డిప్యూటీ ఆర్‌ఎం మధుసూదన్, డీఎం రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన సీపీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన జీవీఎన్ భరతలక్ష్మిని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తికి సీపీ పూలమొక్కను అందజేశారు. పలు అంశాలపై చర్చించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

భిక్కనూరు: ఇచ్చిన హామీ మేరకు విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ భద్రత కల్పించేవరకు సమ్మెను కొనసాగిస్తామని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణగుప్తా అన్నారు. మంగళవారం తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

- ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన జిల్లా విద్యార్థులు
- పలువురికి ఉత్తమ మార్కులు



పి.అన్విత, 464
ఎంపీసీ ఫస్టియర్



ఎస్.శ్రీనిధి, 433
బైపీసీ ఫస్టియర్



ఎస్.అమూల్య, 978
బైపీసీ సెకండియర్



సీహెచ్ సుష్మిత, 950
ఎంపీసీ సెకండియర్

నిజామాబాద్‌అర్బన్/డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఇంటర్ ఫలితాల్లో ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు సత్తాచాటాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకులాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించారని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జ్యోతిర్మయి ఎంపీసీలో 1000 మార్కులకు 956 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే బైపీసీలో మలిహ ఆర్ఫీన్ 974 మార్కులు, ఒకేషనల్‌లో పూజ 974 మార్కులు సాధించారన్నారు. అలాగే ఆర్మూర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోఫియా కుల్సుం బైపీసీలో 967 మార్కులు, మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థిని మనస్విని 932 మార్కులు సాధించారన్నారు. నాగరంలోని మైనారిటీ జూనియర్ బాలుర కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. బైపీసీలో 23 మందికి గానూ 19మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో సయ్యద్ అర్శలాన్ ఎంపీసీ సెకండియర్‌లో 986, బైపీసీలో భార్గవ్ 989 మార్కులు సాధించినట్లు తెలిపారు.

గురుకుల బాలికల ప్రతిభ..

డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గురుకుల బాలికల ప్రతిభ కళాశాల (సీవోఈ) ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. టి.లక్కీ ఎంపీసీ సెకండియర్‌లో 992మార్కులు, తోట కీర్తన బైపీసీలో 993 మార్కులు సాధించారన్నారు. అలాగే ఫస్టియర్‌లో అన్విత ఎంపీసీలో 464, శ్రీనిధి బైపీసీలో 433 మార్కులు సాధించారు. సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరంలో 73 శాతం, ద్వితీయ సంవత్సరంలో 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. సీహెచ్ సుస్మిత ఎంపీసీ సెకండియర్‌లో 950 మార్కులు, అమూల్య బైపీసీలో 978 మార్కులు సాధించారు. కావ్యకిశోరి ఎంపీసీ ఫస్టియర్‌లో 445, బైపీసీలో నవ్యశ్రీ 414 మార్కులు సాధించారు.

నారాయణకు ర్యాంకులు

నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ సెకండియర్ విద్యార్థినులు శ్రావణి 993, లవంగ వైష్ణవి 990 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో అయేషా ఆఫీఫా 438, ఎంపీసీలో వరుణ్ 468 మార్కులు సాధించారు.

వెక్టర్ జూనియర్ కళాశాల ప్రతిభ

వెక్టర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో గౌరవ్‌శర్మ 466, మణిచంద్ర 466, బత్తుల వంశీ 466, ఆశ్రిత 466, మనస్విని 466 మార్కులు సాధించారు. ఎంపీపీ రెండో సంవత్సరంలో నిశాంత్‌రెడ్డి 991, బైపీసీ సెకండియర్‌లో శ్రీవర్షిని 989 మార్కులు సాధించారు.

'అల్ఫోర్స్'కు ఉత్తమ మార్కులు

అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.యోగేష్ ఎంపీసీ ఫస్టియర్‌లో 467 మార్కులు, ముత్యం హరిక 464 మార్కులు సాధించారు. శ్రీజన్ 466, సోనాలిక 467, అంజన్నప్రియ 467, ప్రవళిక 467 మార్కులు సాధించారు.

సంవత్సరాల వారీగా జిల్లా ఉత్తీర్ణత వివరాలు

ఇంటర్ ఫస్టియర్				ఇంటర్ సెకండియర్			
ఏడాది	రాసినవారు	పాసైనవారు	శాతం	ఏడాది	రాసినవారు	పాసైనవారు	శాతం
2018–19	17,004	9,618	57.00	2018–19	16,116	10,726	67.00
2019–20	19,337	9,430	49.00	2019–20	17,364	10,465	60.00
2020–21	18,697	18,697	100.00	2020–21	16,265	16,265	100.00
2021–22	15,360	8,974	58.00	2021–22	15,742	10,372	65.00
2022–23	15,215	7,782	51.00	2022–23	14,086	8,561	60.00
2023–24	14,974	7,479	49.95	2023–24	13,988	8,335	59.59
2024–25	15,056	8,035	53.37	2024–25	13,945	8,117	58.21

ఎంతో గర్వంగా ఉంది...



కాకతీయ కళాశాలలో చదువుతూ ఎంపీసీ ఫస్టియర్‌లో 466 మార్కులు సాధించడం ఎంతో గర్వంగా ఉంది. కళాశాల డైరెక్టర్, అధ్యాపకులు ఎంతగానో సహకరించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. రెండో సంవత్సరంలో మరిన్ని మార్కులు సాధిస్తాను.

– ఎం.హర్షిత, కాకతీయ కళాశాల

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..



కాకతీయ కళాశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. యజమాన్యం ఎప్పటికప్పుడు ప్రణాళిక బద్ధంగా సూచనలు, సలహాలు అందించడం, సందేహాలను నివృత్తి చేశారు. ఇదే ప్రోత్సాహంతో ఎంపీసీ సెకండియర్‌లో 991 మార్కులు సాధించగలిగాను.

– త్రిషచౌదరి, కాకతీయ కళాశాల

ప్రణాళిక ఎంతో ముఖ్యం..



ముందస్తు ప్రణాళిక ఎంతో ముఖ్యం. కళాశాలలో చేరగానే మంచి ప్రణాళిక బద్ధమైన విద్యాబోధన లభించింది. దీనివల్లే ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 468 మార్కులు సాధించగలిగాను. మరిన్ని మార్కులు సాధించడానికి కృషి చేస్తాను.

– ఎ.హర్షిణి, ఎస్ఆర్ కళాశాల

ఒత్తిడి లేకుండా చదివాను...



ఎలాంటి ఒత్తిడి లేకుండ చదవడం వల్ల ఎంపీసీ సెకండియర్‌లో 991 మార్కులు సాధించాను. నిరంతర ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడింది. అధ్యాపకుల సహకారంతో ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకొని చదవగలిగాను.

– నిశాంత్‌రెడ్డి, వెక్టర్ కళాశాల

స్టేట్ మొదటి ర్యాంకు సాధిస్తా..



ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 467 మార్కులు సాధించగలిగాను. వచ్చే ఏడాది రెండో సంవత్సరంలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధిస్తాను. దీనికి అనుగుణంగానే ప్రణాళిక బద్ధంగా చదువుతాను. కళాశాలలో ప్రత్యేకమైన విద్యాబోధన ఎంతో అనుకూలించింది.

– బి.కావ్యశ్రీ, కాకతీయ కళాశాల



ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఎస్ఆర్ కళాశాల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ తదితరులు



రాష్ట్ర స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కాకతీయ కళాశాల డైరెక్టర్లు రామోజీరావు, తేజస్విని

కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగుల రీఎంగేజ్

- ఈనెల 24న తొలగించి, 28న యథాస్థానంలోకి..
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఆర్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలోని కస్తూర్బా బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రీఎంగేజ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్ష ఎక్స్ అఫిషియో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 24న ఆయా ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలని, మళ్లీ వీరందరినీ తిరిగి ఈ నెల 28లోగా యథాస్థానంలో రీఎంగేజ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న సుమారు 571 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వచ్చే విద్యా సంవత్సరం కోసం విధుల్లోకి తీసుకోనున్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ అనుబంధంగా ఉన్న బాలికల హాస్టళ్లు, యూఆర్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి. సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో కేజీబీవీ ఉద్యోగులతోపాటు విధులు నిర్వహిస్తున్న ఇతర ఉద్యోగులను రీఎంగేజ్ చేయడంపై ఉత్తర్వులు వెలువడకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

పనితనం ఆధారంగా తిరిగి విధుల్లోకి..

కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పనితనం ఆధారంగా వారిని తిరిగి విధుల్లో చేర్చుకుంటాం. వారు ఏ అధికారి వద్దనైతే విధులు నిర్వహిస్తున్నారో ఆ అధికారి నుంచి పనితనానికి సంబంధించిన ధ్రువ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

– అశోక్, జిల్లా విద్యాధికారి, నిజామాబాద్

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ముప్కాల్‌లో అవగాహన సదస్సు



ముప్కాల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బాల్కొండ: భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'భూ భారతి' అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ధరణిలో ఉన్న లోపాలను సరి చేస్తూ నూతన చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ చట్టంలో రైతులకు ఇక్కడే న్యాయ సేవలు అందించే అంశం పొందుపరచబడి ఉందన్నారు. కోర్టుల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. వారసత్వ హక్కుల కోసం సాదబైనామాను సులభతరంగా చేసుకోవచ్చన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణితో రైతులను దగా చేశారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట్ అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్, మండల ప్రత్యేకాధికారి స్రవంతి, తహసీల్దార్ గజనాన్, ఎంపీడీవో ఆనంద్ నరేశ్, ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి, డైరెక్టర్ రవి పాల్గొన్నారు.

మెండోరా మండల కేంద్రంలో..

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని, మాట్లాడారు. రైతులకు భూ సమస్యలపై న్యాయ సేవలు భూభారతి చట్టం ద్వారా అందుతాయన్నారు. తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో వనజ, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి పాల్గొన్నారు.

సావెల్ 'సహకారం'లో అక్రమాలు!

- రూ.97లక్షలు గోల్‌మాల్ అయినట్లు తేల్చిన విచారణ అధికారి
- రికవరీ కోసం నోటీస్‌లు జారీ



సావెల్ సహకార సంఘం

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ సహకార సంఘంలో అక్రమాలు జోరుగా సాగాయి. సంఘంలో రూ.80 లక్షలు గోల్‌మాల్ జరిగాయంటూ ఆగస్టులో సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీసీవో శ్రీనివాస్‌రావు, సత్యనారయణ రావును విచారణ అధికారిగా నియామించారు. 8 నెలలుగా విచారణ చేపట్టిన అధికారి రూ.97లక్షలను స్వాహా చేసినట్లు నిగ్గు తేల్చారు. సావెల్ సహకార సంఘం పరిధిలో సావెల్, మెండోరా, కోడిచర్ల, చాకీర్యాల్ గ్రామాలు ఉన్నాయి. గత పాలక వర్గం హయాంలో రూ.35లక్షల నష్టాలు ఉంటే ప్రస్తుత పాలకవర్గం హయాంలో మరో రూ.45 లక్షలు చేరి మొత్తం 80 లక్షలకు చేరినట్లు అనుమానం వ్యక్తం చేశారు. కానీ అంత కంటే ఎక్కువనే దుర్వినియోగం చేసినట్లు లెక్క తేలింది.

ఎవరి వాటా ఎంత..!

సావెల్ సహకార సంఘంలో జరిగిన అవినీతిలో ఎవరి వాటా ఎంత ఉందో తేల్చుటకు అధికారులు ఇంకా విచారణ కొనసాగిస్తున్నారు. సీఈవోగా విధులు నిర్వర్తించిన సురేందర్ రెడ్డి రూ.35 లక్షలు స్వాహా చేసినట్లు, అవి చెల్లించుట కోసం ముందే బాండ్ పేపర్ రాసిచ్చారు. ఎరువుల సేల్స్‌మెన్ రూ.10 లక్షలు గోల్‌మాల్ చేసినట్లు అప్పుడే తేలింది. మిగిలిన రూ.52 లక్షల్లో పాలకవర్గం వా కూడ ఉన్నట్లు విచారణ అధికారి భావిస్తున్నారు. దీంతో పాలకవర్గ సభ్యులను కూడ బాధ్యులను చేస్తూ రికవరీ కోసం నోటీసులు కూడ జారీ చేశారు. సంఘంలో పెద్ద మొత్తంలో స్వాహా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులు జారీ చేశాం..

సావెల్ సహకార సంఘంలో రూ.97లక్షలు స్వాహా చేసినట్లు విచారణ అధికారి తేల్చారు. అందుకు బాధ్యులైన వారందరికీ నోటీసులను జారీ చేశాం. రికవరీ చేసి కేసులు నమోదు చేస్తాం. ఎవరి వాట ఎంత అనే దానిపై విచారణ సాగుతుంది.

– శ్రీనివాస్ రావు, డీసీవో, నిజామబాద్

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి





తెయూ వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న అధికారులు.. నృత్యం చేస్తున్న విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని భారత మహిళల కబడ్డీ టీం ప్రధాన కోచ్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. తెయూ క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించిన యూనివర్సిటీ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరిలతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం పొందవచ్చన్నారు. వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు సమప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యూనివర్సిటీల్లో ఎంతో ప్రతిభ గల విద్యార్థులు ఉన్నారన్నారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, డైరెక్టర్ కల్చరల్ అండ్ యూత్‌సెల్ డైరెక్టర్ లావణ్య, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ సంపత్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, యూజీసీ డైరెక్టర్ ఆంజనేయులు, ప్రొఫెసర్ కనకయ్య, సీహెచ్‌ఆరతి, స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, విద్యావర్ధిని, పీఆర్‌వో పున్నయ్య, ఏఈ వినోద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారు ఇంట్లో భోజనం చేసిన పీసీసీ చీఫ్



నిజామాబాద్ సిటీ: జిల్లాకేంద్రంలోని గౌతంనగర్‌లో ఓ రేషన్ లబ్ధిదారుని ఇంట్లో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ నేతలు భోజనం చేశారు. లబ్ధిదారులు నరేందర్–లక్ష్మి దంపతుల ఇంట్లో వారి కుటుంబసభ్యులతో కలిసి వారు భోజనం చేశారు. ఎన్నికల హామీలు, సన్నబియ్యం ఇవ్వడం వంటి పలు అంశాలు అడిగి తెలుసుకున్నారు. నుడా చైర్మన్ కేశవేణు, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాదర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్, జావెద్ అక్రం తదితరులున్నారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని యోగేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా.. కాలనీకి చెందిన తోగటి భమేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి మామిడిపల్లిలోని వృద్ధాశ్రమానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి తాళం ధ్వంసం చేసిఉండటంతో పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు బీరువాలోని 5తులాల బంగారం, 80గ్రాముల వెండిని దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

కులాస్‌పూర్ తండా, బాడ్సిలో అగ్నిప్రమాదం

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ తండా, బాడ్సి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్న సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. కులాస్‌పూర్ తండాలో బంతిలాల్‌కు చెందిన గడ్డివాముకు మంటలు అంటుకుని పెళ్లి కోసం కొనుగోలు చేసిన కలప దగ్ధమైంది. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమివ్వగా, నిజామాబాద్ నుంచి వచ్చిన సిబ్బంది మంటలార్పేశారు. ప్రమాదంలో సుమారు రూ.40వేల వరకు నష్టం జరిగినట్లు బంతిలాల్ పేర్కొన్నాడు. అలాగే బాడ్సిలో కోసిన వరి గడ్డికి నిప్పంటుకుంది. డయల్ 100కు గ్రామస్తులు ఫోన్ చేయడంతో ఎస్‌ఐ యాదగిరి గౌడ్, సిబ్బందితో అక్కడికి వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగా, ఇందల్వాయి నుంచి వచ్చిన ఫైరింజన్ మంటలను అదుపులోకి తెచ్చింది. బదావత్ చత్రు గడ్డి, కె శ్రీనివాస్ పైపులు ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి.

సిర్నాపల్లి అడవుల్లో ఇసన్నపల్లి వాసి హత్య?

రామారెడ్డి: కామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సిర్నాపల్లి అడవులలో ఏడు నెలల క్రితం హత్య చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. హత్యకు కారకులైన ఇద్దరు వ్యక్తులతో పాటు మృతుడి భార్యను రామారెడ్డి పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్య ఘటనలో ఆరు నుంచి ఎనిమిది మంది పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. మృతుడు గల్ఫ్‌కు వెళ్లినట్లుగా మృతుడి భార్య బంధువులను నమ్మించింది. మృతుడి అన్నకు అనుమానం రావడంతో రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. తన తమ్ముడు గల్ఫ్ దేశం వెళ్లలేదని, తమ్ముడి భార్య వివాహేతర సంబంధం పెట్టుకొని ప్రియుడితో కలిసి అతడిని హత్య చేయించిందని ఫిర్యాదు చేశాడు.మృతుడు గల్ఫ్ దేశం వెళ్లినట్లు ఇమిగ్రేషన్ లేదనే సమాచారం పోలీసులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై ఎస్పీ నేరుగా రంగంలోకి దిగడంతో హత్య ఘటన కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

కుక్కల దాడిలో పసి బాలుడికి గాయాలు



ఆర్మూర్‌లో కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 11వ వార్డులో మంగళవారం ఉదయం శ్రేయన్స్ అనే బాలుడిపై కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి కుక్కను తరిమేసి, గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మద్నూర్‌లో లేగదూడలకు..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ గోశాలలోని రెండు లేగదూడలపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. గోశాలలోకి మంగళవారం ఉదయం కుక్కల గుంపు ప్రవేశించి లేగదూడలపై దాడి చేశాయన్నారు. దీంతో లేగదూడలకు తీవ్ర రక్త స్రావం జరిగిందన్నారు. మరో రెండు లేగదూడలు పారిపోయాయని వాటి కోసం వెతుకుతున్నామని గోశాల నిర్వాహకులు తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి



రమేష్ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ శివారులోని గుండ్ల చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన రమేష్(35) బతుకుతెరువు కోసం అంకాపూర్‌కు వచ్చి, పనిచేస్తున్నాడు. కాగ మంగళవారం బర్రెలను మేపుతుండగా చెరువులో పడిన బర్రెను కాపాడే ప్రయత్నంలో రమేష్ నీటిలోకి దిగాడు. చెరువులోని చేపల వల అతడికి తట్టుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..



రాకేష్ మృతదేహం

వర్ని: మండల కేంద్రంలోని వీక్లీ మార్కెట్లో సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఆర్య రాకేష్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదని, విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమలాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన కర్రెనోళ్ల రంజిత్ (28) ఆత్మహత్య చేసుకున్నట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. రంజిత్ తల్లి భూలక్ష్మి గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. తల్లికి వ్యాధి తగ్గకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రంజిత్ సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. తల్లి భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆర్మూర్ టౌన్: మహిళను హత్య చేసిన కేసులో మామిడిపల్లికి చెందిన దండుగల తిర్మల్ అనే వ్యక్తికి నిజామాబాద్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ మంగళవారం జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ గౌడ్ తెలిపారు. తిర్మల్ 2007లో పొరుగింట్లో ఉంటున్న చంద్రకళను గొడ్డలితో దాడి చేసి హతమార్చాడు. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నిందితుడి కోర్టులో ప్రవేశ పెట్టారు. విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు.

అత్యాచారం కేసులో..

ఖలీల్‌వాడి: మోపాల్ మండలం న్యాల్‌కల్ గ్రామానికి చెందిన నిందితుడు బత్తుల రాములు(39)కి అత్యాచారం కేసులో జీవితఖైదు శిక్ష విధిస్తు జడ్జి శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు. నిందితుడు 2018లో ఓ మహిళపై అత్యాచారం చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నిందితుడికి జీవిత ఖైదు జైలు శిక్ష, రూ. 1000 జరిమానాను జడ్జి విధించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవ నగర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(44) ఇటీవల ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రూరల్ రెండవ ఎస్సై ఆనంద్ సాగర్ తెలిపారు. శ్రీనివాస్ మద్యానికి బానిసై ఈనెల 16న గడ్డిమందు తాగి, కుటుంబసభ్యులకు తెలిపాడు. వెంటనే వారు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.